

నిర్మల్ రూరల్ మండలం వెంగాపేట్‌లో తొలిసారి ఓటు వేసిన యువకులు..

నిమ్మలంగా ఓటేశారు!



ఓటు వేశామని సిరాచుక్క చూపుతున్న యువతులు





నిర్మల్ పట్టణం మంజులాపూర్ పోలింగ్ కేంద్రంలో బారులుతీరిన ఓటర్లు



ఎల్లపల్లిలో ఓటు వేసిన 85 ఏళ్ల వృద్ధురాలు

- జిల్లాలో నిదానంగా సాగిన పోలింగ్..
- 5 గంటల తర్వాత భారీగా నమోదు..
- గతంతో పోలిస్తే 2 శాతం తక్కువ..
- పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు..
- పార్టీ కార్యకర్తల మధ్య తోపులాటలు
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై కేసు

నిర్మల్:

నిర్మల్.. రోజంతా బారులుగా నిల్చుని ఓపికతో ఓటేసింది.

ఖానాపూర్.. క్షణం కదలకుండా ఓటేసే దాకా నిల్చుంది.

ముధోల్.. ఓట్ల పండుగకు మొత్తం ఊళ్లను కదిలించింది.


ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేందుకు జిల్లా ఓటర్లు గురువారం ఓటు అనే వజ్రాయుధాన్ని సంధించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరి ఓపికతో ఓటేశారు. తమ హక్కును సద్వినియోగం చేసుకున్నారు. కొత్త ఓటర్లు మొదలు.. వందేళ్లుదాటిన సీనియర్లూ నేను సైతం.. అంటూ ఓటు కోసం రావడం విశేషం. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కలిపి 78 శాతం పోలింగ్ నమోదైంది. గత 2018ఎన్నికలతో పోలిస్తే ఈసారి 2 శాతం ఓటింగ్ తక్కువగా నమోదు కావడం గమనార్హం. ఓటు వేయాలంటూ స్వీప్ ద్వారా అధికార యంత్రాంగం జోరుగా ప్రచారం చేపట్టినా చాలామంది ఓటర్లు పోలింగ్‌కేంద్రాలకు రాలేదు.


ప్రశాంతంగా పోలింగ్..


జిల్లావ్యాప్తంగా మూడు నియోజకవర్గాల్లో చెదురుముదురు ఘటనలు, ఈవీఎంల మొరాయింపు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మూడు నెలలుగా సాగిన సమరం సాఫీగా ముగింపుదశకు చేరింది. ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులూ 'హమ్మయ్యా..' అని ఊపిరి పీల్చుకున్నారు.

ఈవీఎంలలో ఓటరు తీర్పు..

జిల్లావ్యాప్తంగా మూడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 923 పోలింగ్ కేంద్రాల్లో బుధవారం సాయంత్రం నుంచి గురువారం రాత్రి వరకూ అధికారులు, సిబ్బంది నిర్విరామంగా శ్రమించారు. ఎట్టకేలకు జిల్లాలో పోలింగ్ పర్వాన్ని ప్రశాంతంగా ముగించారు. సాయంత్రం ఐదింటికే పోలింగ్ సమయం ముగిసినా అప్పటి వరకు కేంద్రాల్లో ఉన్న ఓటర్లతో ఓట్లు వేయించి, తమకు అప్పగించిన పోలింగ్ సామగ్రిని తీసుకుని పంపిణీ కేంద్రాలకు వద్దకు వచ్చేసరికి రాత్రయ్యింది. అధికారులు వీరి కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. నిర్మల్, ముధోల్, ఉట్నూర్‌లలో ఏర్పాటు చేసి పంపిణీ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బంది తీసుకువచ్చిన ఈవీఎంలు, వీవీప్యాట్లను రిటర్నింగ్ అధికారులు మళ్లీ స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపర్చారు. అభ్యర్థుల భవితవ్యం ఈనెల 3న ఈవీఎంలు బయటపెట్టనున్నాయి.







నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం ఇలా

నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే..

- పోలింగ్‌పరంగా మూడు నియోజకవర్గాలలో ముధోల్ ముందుంది. జిల్లాలో మొత్తం 78 శాతం నమోదుకాగా, నిర్మల్‌లో 76.02 శాతం నమోదైంది. నియోజకవర్గంలో ఉదయం మందకొడిగా ప్రారంభమైనా క్రమంగా పుంజుకుంది. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత శరవేగంగా పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఇక్కడ 3శాతమే తక్కువగా నమోదైంది.
- ఖానాపూర్ నియోజకవర్గంలో ఈసారి పోలింగ్ ఒకశాతం తగ్గింది. ఇక్కడ గత ఎన్నికల్లో 78.42 శాతం ఉండగా, ఈసారి 77.46శాతం నమోదైంది. ఇక్కడ ఉదయం నుంచే ఓటర్లు బారులుదీరి ఓటేశారు. అటవీ గ్రామాల్లోనూ పొద్దున్నుంచే ఓట్లు వేయడం కనిపించింది.
- ముధోల్ నియోజకవర్గంలో ఈసారి పోలింగ్ శాతం 2 శాతం తగ్గింది. గత ఎన్నికల్లో ఏకంగా 82.66 శాతం నమోదుకాగా, ఈ సారి 80.54 శాతం పోలింగ్ నమోదైంది. ఓ ట్ల నమోదు వేగవంతంగా సాగినా.. ఇక్కడ ఓట్లు వేసే వారి సంఖ్య కొంత తగ్గింది.

చలిలోనే మొదలు..

తుపాను కారణంగా రెండురోజుల నుంచి జిల్లాలో చలి పెరిగింది. ఇలాంటి వాతావరణాన్ని సైతం లెక్క చేయకుండా.. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ కేంద్రాల వైపు ఓటర్లు కదిలారు. ప్రధానంగా పల్లెల్లో పొద్దున్నే చాలామంది ఓట్లు వేయడం కనిపించింది. జిల్లావ్యాప్తంగా ఉదయం 9 గంటల వరకు 9.24 శాతం పోలింగ్ నమోదైంది. అక్కడి నుంచి గంటగంటకూ కేంద్రాలకు ఓటర్ల తాకిడి పెరుగుతూ వచ్చింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గణనీయంగా పోలింగ్‌శాతం నమోదైంది. ఆ సమయంలో దాదాపు అన్ని కేంద్రాలు ఓటర్లతో కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు చాలా కేంద్రాలు ఖాళీగా ఉన్నాయి. కొన్ని మేజర్ గ్రామపంచాయతీలు, పలు కేంద్రాల్లో మాత్రం సాయంత్రం 5 గంటల తర్వాత కూడా ఓటర్ల బారులు కనిపించాయి. ఉదయం నెమ్మదిగా మొదలై మధ్యాహ్నం పుంజుకున్న పోలింగ్ చివరి గంట వ్యవధిలో భారీగా పోలింగ్ నమోదైంది.

ఓటుకు అడ్డురాని వయసు..

ఎప్పటిలాగే ఈసారీ చిన్నపెద్దా తేడా లేకుండా అన్నివయసుల వారు స్వచ్ఛందంగా ఓటేశారు. తొలిసారి ఓటర్లతోపాటు వందేళ్ల పైబడ్డ వృద్ధులు కూడా ఆసక్తిగా వచ్చి ఓటేయడం కనిపించింది. దివ్యాంగులు, గర్భిణులు, బాలింతల రావడంతో వారికోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చెదురుమదురు ఘటనలు..

గతంలో ఎప్పుడూ లేనంతగా ఈసారి ఎన్నికలు పోటాపోటీగా ఉండటంతో పోలింగ్‌రోజు చాలా చోట్ల కాస్త ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. మూడు పార్టీలకూ ఈ ఎన్నికలు చావోరేవో తేల్చుకునేలా కొనసాగాయి. సారంగపూర్ మండలం, నిర్మల్ పట్టణంలోని పలు కేంద్రాల వద్ద బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాటలు చోటుచేసుకున్నాయి. నిర్మల్‌రూరల్ మండలం ఎల్లపెల్లిలో ఓటువేయడానికి వెళ్లినప్పుడు పార్టీ కండువా వేసుకుని వెళ్లారంటూ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై కేసునమోదైంది. జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గులాబీ కండువాతో కేంద్రాల్లోకి వెళ్తున్నారంటూ బీజేపీ నాయకులు నినాదాలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఓటేసిన 104 ఏళ్ల పోసవ్వ



లక్ష్మణచాంద మండలం పీచర గ్రామానికి చెందిన 104 ఏళ్ల బుర్రి పోసవ్వ గురువారం అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటుహక్కు వినియోగించుకుని ఆదర్శంగా నిలిచింది. తన మనుమడి సహాయంతో వీల్‌చైర్‌లో ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వచ్చింది. – లక్ష్మణచాంద

105 ఏళ్ల లక్ష్మీబాయి కూడా..



కుంటాల మండల కేంద్రానికి చెందిన 105 ఏళ్ల లక్ష్మీబాయి కూడా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కు వినియోగించుకుంది. తన మనవడు పోశెట్టి సహాయంతో పోలింగ్ కేంద్రానికి వచ్చింది. 'నేను ఓటు వేశా.. మీరు కూడా ఓటు వేయాలని' కోరింది. – కుంటాల

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



బాసర పోలింగ్ కేంద్రం తనిఖీ చేస్తున్న కలెక్టర్

భైంసా: బాసరలోని ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, మానిటరింగ్‌సెల్‌ను పరిశీలించారు. అనంతరం పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ తీరును అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సందర్శించిన ఎస్పీ



బందోబస్తు పరిశీలిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

ఖానాపూర్: పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ ప్రవీణ్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఆరు పోలింగ్ బూత్‌లలో సిబ్బంది విధులు, ఏర్పాట్లను పరిశీలించారు. 144 సెక్షన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సీఐ మోహన్, ఎస్సై లింబాద్రి ఉన్నారు.







భైంసా, నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఓటేసేందుకు వచ్చిన దివ్యాంగులు..



చేతులపై ఎత్తుకుని..



ఓటేసిన ట్రాన్స్‌జెండర్లు



ఈవీఎంలతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు..



స్ట్రాంగ్ రూంకు ఈవీఎంల తరలింపు..

బెట్టు వీడిన మూడు గ్రామాలు..



వంటావార్పుతో నిరసన తెలుపుతున్న గిరిజనులు



గిరిజనులకు నచ్చజెబుతున్న అదనపు కలెక్టర్



2:30 తర్వాతే పోలింగ్‌లో పాల్గొన్న గిరిజనులు

- ఓటు వేసిన గుమ్మెన, ఎంగ్లాపూర్, కొలాంగూడ ప్రజలు
- అడిషనల్ కలెక్టర్ చొరవతో ఓటు వేసిన గిరిజనులు
- సమస్యలు పరిష్కరించకపోతే లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరిక

పెంబి: మండంలోని ఎంగ్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుమ్మెన, నాయకపుగూడ, కొలాంగూడ గ్రామాల ఓటర్లు ఎట్టకేలకు బెట్టు వీడారు. తమ గ్రామాలకు రోడ్లు, త్రీఫేజ్ కరెంట్ సౌకర్యాలు లేవని ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్‌లో భాగంగా ఎంగ్లాపూర్ గ్రామంలో పోలిగ్ కేంద్రం 226 ఏర్పాటు చేయగా.. సమస్యలు పరిష్కరించే వరకు ఓట్లు వేయబోమని గురువారం దొత్తి వాగు సమీపంలో వంటావార్పుతో నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అక్కడి చేరుకోని ఓటేయాలని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ వారు స్పందించలేదు. సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ కావాలని డిమాండ్ చేశారు. దీంతో అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ గ్రామానికి చేరుకుని సమస్యలను పైఅధికారులకు నివేదిస్తామని, నెల రోజుల్లో కలెక్టర్‌తోపాటు ఫారెస్ట్ అధికారులతో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. అనేక విధాలుగా మధ్యాహ్నం 2:30 గంటల వరకు నచ్చజెప్పారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరిస్తామని చెప్పారు. ఇందుకు అధికారులు అంగీకరించడంతో 2:30 తర్వాత ఓటింగ్‌లో పాల్గొన్నారు.

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై కేసు



నిర్మల్ రూరల్: నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. తన సొంత గ్రామమైన ఎల్లపల్లిలో గురువారం ఉదయం ఓటు వేసిన ఆయన పార్టీ కండువా వేసుకుని పోలింగ్ కేంద్రంలోకి వచ్చారు. గమనించిన ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఈసీ నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించి రూరల్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. అంతేకాకుండా మధ్యాహ్న జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ పోలింగ్ స్టేషన్‌కు కూడా ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీ కండువా వేసుకుని వెళ్లారు. దీంతో బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసులు వారిని చెదరగొట్టారు.

ఓటేసిన నాలుగు తరాలు..



నిర్మల్: ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండుగంటే అందరికీ ఆసక్తే. వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరికీ ఓటేయాలనే ఉంటుంది. జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్‌కు చెందిన గంప భాగీరథమ్మకు 101 ఏళ్లు. ఇప్పటికీ ఆరోగ్యంగా తనపని తాను చేసుకుంటున్న ఈ బామ్మ గురువారం ఓటేశారు. తన కొడుకు గంప శ్రీనివాస్, మనుమడు అనిల్‌కుమార్, మునిమనుమడు కృష్ణచైతన్యలతో కలిసి ఓటేసి వచ్చారు. ఇలా ఈ ఇంటి నుంచి నాలుగు తరాలు పోలింగ్‌లో పాల్గొనడం విశేషం.

క్లుప్తంగా

దీపాయిగూడలో మొరాయించిన ఈవీఎం

జైనథ్: మండలంలోని దీపాయిగూడ గ్రామంలో 28వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. గురువారం అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేయడానికి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లకు ఎదురుచూపులు తప్పలేదు. 7గంటలకు ఈవీఎం ప్రారంభించడానికి అవసరమైన సెట్టింగ్‌లు చేస్తుండగా ఈవీఎం మొరాయించినట్లు సమాచారం. దాదాపు 20నిమిషాల పాటు ఈవీఎం మొరాయించడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. ఎట్టకేలకు అధికారులు ఈవీఎంను సిద్ధం చేసినప్పటికీ, పోలింగ్ మొదలైన 46నిమిషాలకు ఓటర్లను అనుమతించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

జోగు రామన్నను అడ్డుకున్న బీజేపీ శ్రేణులు



బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులను చెదరగొడుతున్న పోలీసులు

ఎదులాపురం: పోలింగ్ సరళిని పరిశీలించేందుకు పలు కేంద్రాలను సందర్శించి పరిశీలిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్నను బీజేపీ శ్రేణులు అడ్డుకున్నారు. పట్టణంలోని శ్రీరాంకాలనీలోని సమీకృత గిరిజన బాలికల వసతి గృహానికి చేరుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్నను అక్కడి బీజేపీ శ్రేణులు అడ్డుకున్నారు. పెద్ద ఎత్తున వ్యతిరేక నినాదాలు చేస్తూ అడ్డుకోగా అక్కడే ఉన్న పోలీసులు గమనించి వారిని నిలువరించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు కల్పించుకుని బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులను అక్కడి నుంచి చెదరగొట్టారు. పరిస్థితి అదుపులోకి రావడంతో ఎమ్మెల్యే పోలింగ్‌స్టేషన్‌ను సందర్శించి సరళిని పరిశీలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం



మంటలు ఆర్పుతున్న దృశ్యం

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన సబ్బన్ సాయినాథ్ అనే రైతు ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి పంట షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైనట్లు బాధిత రైతు వాపోయాడు. ఆయన వివరాల ప్రకారం... రైతు సాయినాథ్ ఏరిన పత్తిని ఇంటి ఎదుట నిల్వ చేసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం విద్యుత్ తీగలకు షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి పత్తికి మంటలు వ్యాపించాయి. గమనించిన కుటుంబీకులు, గ్రామస్తులు మంటలు ఆర్పేలోగా సుమారుగా రెండు క్వింటాళ్ల పత్తి పంట దగ్ధమైనట్లు తెలిపాడు.

వాగులో పడి వృద్ధురాలి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన జంగిలి లక్ష్మీబాయి (75) వాగులో పడి బుధవారం మృతి చెందినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..యాపల్‌గూడకు చెందిన లక్ష్మీబాయి మతిస్థిమితం కోల్పోయింది. ఇదే క్రమంలో ఆమె గ్రామ శివారు ప్రాంతాంలో తిరుగుతూ వెళ్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా వాగులో పడి మృతిచెందింది. గురువారు మృత్యురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఓటు వేసే ముందు సంతకం చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి



ఆదిలాబాద్‌టౌన్: ఓటువేసిన ఎమ్మెల్యే రామన్న



కుటుంబంతో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్



సతీమణితో బీజేపీ బోథ్ అభ్యర్థి సోయం బాపూరావు



తరలివచ్చి.. ఓటువేసి



ఖానాపూర్: బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్



ఆదిలాబాద్‌టౌన్: భార్యతో కాంగ్రెస్ అభ్యర్థి



కుటుంబంతో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు



ఓటు వేసిన మహిళలు



బైంసారూరల్: కాంగ్రెస్ అభ్యర్థి నారాయణ్‌రావుపటేల్



ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటును వినియోగించుకునేందుకు ఓటర్లు భారీగా తరలివచ్చారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచే ఓటర్లు బారులుతీరారు. తుది సమయం ముగిసే వరకు ఓటర్లు పలు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుతీరారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ అదే తీరైన వాతావరణం కనిపించింది. యువకులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు పోటీపడి ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతం సరళిని ఎన్నికల అధికారులు ప్రకటించారు. - సాక్షి నెట్‌వర్క్



ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్‌జాదవ్



ఖానాపూర్: ఎమ్మెల్యే రేఖానాయక్



కాంగ్రెస్ ఖానాపూర్ అభ్యర్థి బొజ్జు



ఆదిలాబాద్‌టౌన్: మాజీ ఎంపీ గొడం నగేశ్



బైంసాటౌన్: బీజేపీ అభ్యర్థి రామారావుపటేల్



నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థి



మావలలో ఓటు వేసేందుకు క్యూలో ఓటర్లు



ఓటేసేందుకు వస్తున్న వృద్ధురాలు..



కాంగ్రెస్ బోథ్ అభ్యర్థి అడె గజేందర్



ఖానాపూర్: బీజేపీ అభ్యర్థి రమేశ్



బైంసారూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



తాంసి: మొదటిసారి ఓటువేసిన యువతులు



కుటుంబీకులతో ఓటువేసిన నిర్మల్ బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి

అభివృద్ధికి తొలిఓటు

- ఓటు హక్కును వినియోగించుకున్న నూతన ఓటర్లు



ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తొలిసారిగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసేందుకు జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో వరుసలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తెలుసుకుని ఓటరుగా నమోదు చేసుకున్నామని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో విద్యను అభ్యసిస్తున్నప్పటికీ ప్రయాణ ఖర్చులను లెక్కచేయకుండా ఓటుకే ప్రాధాన్యతనిచ్చామని చెప్పారు. యువత ఓట్లు కీలకమని భావించి తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునేందుకు ఇది మంచి అవకాశంగా భావించి ఓట్లు వేశామని చెప్పారు. తొలి ఓటు వేసిన వారి అభిప్రాయాలు..

సంతోషాన్నిచ్చింది..



అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వేశాను. చాలా సంతోషమనిపించింది. ఆరు నెలల క్రితం ఓటరు కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇటీవల ఓటు హక్కు వచ్చింది. విద్యానగర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశాను. యువత చాలా మంది ఈసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

– జి.కునాల్ గౌడ్, విద్యానగర్, ఆదిలాబాద్

తొలిసారి ఓటు వేశాను..



ఈసారి నాకు ఓటు హక్కు వచ్చింది. పట్టణంలోని హమీద్‌పూర కాలనీలో గల పోలింగ్ కేంద్రంలో ఓటు వేశాను. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. మనకి నచ్చిన నాయకుడిని ఎన్నుకునేది ఓటు ద్వారా సాధ్యం. రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవడం ఆనందంగా ఉంది.

– ధనశ్రీ, డిగ్రీ విద్యార్థిని

ఓటు విలువ తెలిసి..



ఓటు చాలా విలువైనది. కొంత మంది ఓటు హక్కు ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా ఓటు వేయడం లేదు. తొలిసారిగా ఓటు హక్కు రావడంతో నేను ఇతర ప్రాంతంలో ఎంబీబీఎస్ చదువుతున్నప్పటికీ ఓటు వేసేందుకు ఆదిలాబాద్‌కు వచ్చాను. మా కుటుంబ సభ్యులతో కలిసి భుక్తాపూర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశాను.

– సృష్టి, మెడికో విద్యార్థి

ఓటు నా బాధ్యత..



తొలిసారి నాకు ఓటు హక్కు వచ్చింది. ఓటు వేయడం నా బాధ్యతగా భావించాను. సరైన నాయకుడిని ఎన్నుకోవాలని కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నాను. యువత ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి.

– అనవిక, డిగ్రీ విద్యార్థిని

సంతోషంగా ఉంది



లక్ష్మణచాంద: తనది మండలంలోని చామన్‌పెల్లి గ్రామం. తను అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడం ఇదే మొదటిసారి కావడంతో చాలా సంతోషంగా ఉంది. నాకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయడం ఆనందం అనిపించింది.

– వనిత, చామన్‌పెల్లి

మొదటిసారి ఓటు హక్కు..



లక్ష్మణచాంద: తనది మండలంలోని చింతల్‌చాంద గ్రామం. తనకు ఓటు హక్కు ఇటీవలనే వచ్చింది. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నాను.

– శైలజ, చింతల్‌చాంద

ఉత్సాహంగా ఓటు



తాంసి: మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్నాను. ఎంతో ఉత్సాహంగా అనిపించింది. ఉదయం నుంచే పెద్దఎత్తున యువత ఓటింగ్‌లో పాల్గొన్నారు.

– శ్రీజ, అంబుగాం

విలువను తెలిపేలా..

ఓటు హక్కు విలువను తెలిపేలా అధికారులు చేసిన ప్రచారంతో ఓటు కోసం దరఖాస్తు చేశాను. ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రకటించిన ఓటర్ల జాబితాలో ఓటును పొందాను. ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉంది.

– చిల్కూరి దీప్తీ, ఓల్డ్ హౌజింగ్‌బోర్డు

భవిష్యత్తును మార్చే అస్త్రం..



నేను నిజామాబాద్‌లో బీడీఎస్ చదువుతున్నాను. నా తొలి ఓటు వేయాలని జిల్లా కేంద్రానికి వచ్చాను. భుక్తాపూర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశాను. సరైన నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటే ఆయుధం. ప్రజలకు మంచి చేసే నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఓటు కల్పిస్తోంది.

– సాన్వి తాటే, బీడీఎస్ విద్యార్థి

అందుబాటులో ఉండి సేవ చేయాలి



తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. ఉదయమే పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశాను. చాలా మంది వరుసలో ఉన్నప్పటికీ ఎలాంటి విసుగు రాలేదు. బాధ్యతగా భావించి ఓటు హక్కును వినియోగించుకున్నాను. రెండు మూడు రోజులుగా ఎవరికి ఓటు వేయాలని ఆలోచించి నిర్ణయం తీసుకున్నాను.

– దుర్గా, డిగ్రీ విద్యార్థిని

మంచి నేతను ఎన్నుకునే అవకాశం



ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది. అలాంటి వజ్రాయుధాన్ని తొలిసారిగా వినియోగించుకున్నాను. ప్రజల కోసం పనిచేసే నాయకుడిని ఓటు హక్కు వినియోగం ద్వారా ఎన్నుకునే అవకాశం కలుగుతుంది. నాకు నచ్చిన నాయకుడికి ఓటు వేయడం ఆనందంగా ఉంది.

– జే. శ్వేత, డిగ్రీ విద్యార్థిని

ఓటు బాధ్యతగా భావించాను..



ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఇటీవల బీఎల్ఓ ద్వారా ఓటు హక్కుకు దరఖాస్తు చేశాను. ఓటు హక్కును పొంది ఈ ఎన్నికల్లో తొలిసారిగా వినియోగించుకున్నాను. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును బాధ్యతగా భావించి వినియోగించుకుంటే మంచి నాయకులను ఎన్నుకునే అవకాశం ఉంటుంది.

– కె.కౌశిక్, ఆదిలాబాద్

వాయిదా వేసుకున్న



లక్ష్మణచాంద: రెండు నెలల కిందటనే అమెరికా నుంచి లక్ష్మణచాందకు వచ్చాను. తిరిగి గురువారం వెళ్లాల్సి ఉంది. కానీ ఎన్నికలు ఉండటంతో గురువారం తాను ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం తన టికెట్‌ను మరో రెండు రోజులు పోస్ట్‌పోన్ చేసుకున్నాను.

– అద్వాల స్పందన, లక్ష్మణచాంద